క్లుప్తంగా

'ఎస్ఎస్‌బీ'కి యువకుడి ఎంపిక

పెంచికల్‌పేట్: మండలంలోని కొండపల్లి గ్రామానికి చెందిన లింగమూర్తి –సరోజ దంపతుల కుమారుడు నగునూరి సతీశ్ సహస్ర సీమ బల్ (ఎస్ఎస్‌బీ)కు ఎంపికయ్యాడు. మారుమూల గ్రామానికి చెందిన యువకుడు దేశ సేవలో కేంద్రబలగాలకు ఎంపిక కావడంతో యువకుడిని గ్రామస్తులు, మిత్రులు అభినందించారు.

భక్తిశ్రద్ధలతో ఎక్కాహం


భజనలు చేస్తున్న భక్తులు

దహెగాం: శ్రావణమాసం సందర్భంగా మండల కేంద్రంలోని పోచమ్మ ఆలయంలో ఎక్కాహం నిర్వహించారు. గురువారం ఉదయం నుంచి ప్రారంభమైన ఎక్కాహం శుక్రవారం సాయంత్రం ముగిసింది. రోజంతా భక్తులు భజనలు చేశారు. ఈ సందర్భంగా అన్నదానం ఏర్పాటు చేశారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు పండాలని, ప్రజలు ఆరోగ్యంగా ఉండాలని మొక్కులు చెల్లించారు.

బాలికలు పౌష్టికాహారం తీసుకోవాలి


కిశోరామృతం అందజేస్తున్న ఎంపీపీ

దహెగాం: బాలికలు ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం పౌష్టికాహారం అందజేస్తుందని ఎంపీపీ కంబగౌని సులోచన అన్నారు. శుక్రవారం మండలంలోని చినరాస్పెల్లి అంగన్‌వాడీ కేంద్రంలోని బాలికలకు కిశోర అమృతం పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ బాలికలు పౌష్టికాహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త శోభ, కిషోర బాలికలు పాల్గొన్నారు.


కౌటాల: కిశోర బాలికలు పౌష్టికాహారం తీసుకోవాలని సర్పంచ్ వొజ్జల మౌనిశ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని సదాశివపేట అంగన్‌వాడీ కేంద్రంలో కిశోర బాలికలకు కిశోర అమృతం పంపిణీ చేశారు. అంగన్‌వాడీ టీచర్ జీజాబాయి తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఐసీ వార్షికోత్సవం


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న బీఎం సుభాశ్

ఆసిఫాబాద్‌అర్బన్: భారతీయ జీవితబీమా సంస్థ 67వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఎల్ఐసీ శాటిలైట్ కార్యాలయంలో బీమా వారోత్సవాలను మొదటిరోజు మేనేజర్ సుభాశ్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఎల్ఐసీ 33 కోట్లకు పైగా పాలసీదారులతో లక్షకుపైగా ఉద్యోగులతో, 13 లక్షలకుపైగా ఏజెంట్లతో అత్యుత్తమ సేవలు అందిస్తుందన్నారు. డీవోలు నర్సయ్య, శ్రీధర్, అధికారులు మహేందర్, ఏజెంట్లు ప్రమోద్, అశోక్, సుభాశ్, వి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

కొండ చిలువ మృతి


మృతి చెందిన కొండ చిలువ

దహెగాం: రోడ్డుపైకి వచ్చిన కొండచిలువ పైనుంచి గుర్తు తెలియని వాహనం వెళ్లడంతో మృతి చెందింది. పెంచికల్‌పేట్ మండలం చెడ్వాయి సమీపంలో గురువారం అర్ధరాత్రి మృతి చెందినట్లు డీఆర్వో ప్రభాకర్ తెలిపారు. మృతి చెందిన కొండ చిలువను దహనం చేశారు.

నేడు, రేపు ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం

సిర్పూర్(టి): మండలంలోని గ్రామపంచాయతీల్లో ఈనెల 2, 3వ తేదీల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి తహసీల్దార్ లలిత ఒక ప్రకటనలో తెలిపారు. రెండు రోజులలో బూత్‌స్థాయి అధికారులు పోలింగ్ కేంద్రాల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు విధులు నిర్వర్తిస్తారని, 2వ తేదీన పోలింగ్ కేంద్రాల్లో గ్రామపంచాయతీ సర్పంచ్, కార్యదర్శులు, గ్రామస్తులతో కలిసి ప్రత్యేక గ్రామసభ నిర్వహించాలని సూచించారు. గ్రామసభలో ఓటరు జాబితాను పరిశీలించి తప్పు ఒప్పులను గుర్తించి బీఎల్‌వోల ద్వారా సరిచేసుకోవాలని కోరారు.

దహెగాం: 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులు ఓటరుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ కవిత అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌వోలకు సమావేశం ఏర్పాటు చేశారు.

తరలుతున్న ఇసుక..!

- జోరుగా అక్రమ రవాణా
- అనుమతులు తీసుకోకుండానే తరలింపు
- పట్టించుకోని అధికారులు


ఆసిఫాబాద్‌లోని పెద్దవాగులో ట్రాక్టర్లలో ఇసుక నింపుతున్న కూలీలు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలో ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. ఎలాంటి అనుమతులు లేకుండా నిత్యం వందలాది ట్రాక్టర్ ట్రిప్పుల ఇసుకను కొందరు ప్రజాప్రతినిధుల అండదండలతో తరలిస్తున్నారు. ఇసుకకు డిమాండ్ పెరగడంతో అవకాశాన్ని అనుగుణంగా మలుచుకుని కొంతమంది ఇసుక అక్రమ రవాణాదారులు పగటిపూట ఏదో ఒక చోట ఇసుక డంప్ చేసి రాత్రికి రాత్రే ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. వాగుల్లో ఇసుక లోతుగా తవ్వడంతో వాగులు ప్రమాదకరంగా మారుతున్నాయి. అధికారులు మాత్రం పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు.

అనుమతులు లేకుండానే..

అనుమతులు లేకపోయినా జిల్లా కేంద్రంతో పాటు మండల పరిధిలో చేపడుతున్న ఇళ్ల కట్టడాలు, సిమెంట్‌తో తయారు చేసే ఇటుక, పైపులు, రింగులు, కుండీలు, పోల్స్, వాల్‌ప్లేట్ల పరిశ్రమలకు ఎలాంటి అనుమతులు లేకుండా రాత్రి, పగలు జిల్లా కేంద్రంలోని పెద్దవాగు, చిలాటిగూడ, గుండి, చిర్రకుంట, రెబ్బెన మండలంలోని గంగాపూర్, కాగజ్‌నగర్, రాస్‌పెల్లి, వాగుల నుంచి నిత్యం ట్రాక్టర్ల ద్వారా ఇసుక తోడేస్తున్నారు. వర్షాకాలం ఇసుక దొరకడం లేదని ట్రాక్టర్ ఇసుకకు దూరాన్ని బట్టి రూ.1500 నుంచి రూ.2500 వరకు పలుకుతుండగా, ఇతర ప్రాంతాలకు దురాన్ని బట్టి జైనూర్, కెరమెరికి రూ.4500 వరకు వసూలు చేస్తున్నారు. కొంతమంది ప్రభుత్వ కార్యాలయాలకు, గ్రామ పంచాయతీ అభివృద్ధి పనులకు అని చెప్పి అక్రమ రవాణా చేస్తున్నారు.

జోరుగా దందా...

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వాగుల్లో ఇసుక భారీ స్థాయిలో ఒడ్డుకు కొట్టుకొచ్చింది. కొద్ది రోజులుగా పొడి వాతావరణం ఉండడంతో అన్ని మండలాల్లో ఇసుక తవ్వకాలు సాగుతున్నాయి. వర్షాకాలంలో నెలకొన్న ఇసుక కొరతను అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు. ఆసిఫాబాద్ మండల పరిధిలో గుండి, గుడెన్‌ఘట్, చిలాటిగూడ, జిల్లా కేంద్రంలోని పెద్దవాగు, గోడవెల్లి దారి వద్ద జోరుగా ఇసుక దందా సాగుతోంది. పగటిపూట అనువైన స్థలంలో డంపింగ్ చేసుకుని రాత్రిపూట లోడింగ్ చేసి ఆదిలాబాద్, ఉట్నూర్ మహారాష్ట్రతో పాటు వేరే ప్రాంతాలకు ఇసుక తరలిస్తున్నారు. అక్రమంగా ఇసుక తరలిస్తున్నారనే సమాచారంతో అధికారులు వెళ్లే లోగా అక్రమార్కులు జారుకుంటున్నారు. రాత్రి వేళల్లో ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతుండడంతో సంబంధిత అధికారులు వెళ్లేందుకు ధైర్యం చేయడం లేదు.

ట్రాక్టర్లు సీజ్ చేస్తాం

వాగుల్లోని ఇసుకను అనుమతులు లేకుండా తరలిస్తే ట్రాక్టర్లను సీజ్ చేస్తాం. ఇసుక తరలింపునకు తప్పకుండా అనుమతులు తీసుకోవాలి. అక్రమ దందాను అడ్డుకునేలా చర్యలు చేపడుతాం.

– రమేశ్, తహసీల్దార్, ఆసిఫాబాద్

బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం

- ఎమ్మెల్యే కోనేరు కోనప్ప

బెజ్జూర్: బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. శుక్రవారం మండలంలోని బారెగూడ గ్రామంలో శ్రీ ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్టాపనకు వచ్చిన ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కర్జిల్లి నుంచి ముంజంపల్లి గ్రామం వరకు రహదారి నిర్మాణానికి రూ. 2.5 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. బారేగూడ గ్రామంలో రహదారి నిర్మాణానికి రూ.60 లక్షలు, మండల కేంద్రంలోని ప్రభుత్వ కళాశాల నుంచి నాగుల్వాయి గ్రామానికి వెళ్లే రహదారికి రూ.40 లక్షలు రెండు రోజుల్లో మంజూరవుతాయని పేర్కొన్నారు. మండల కోఆప్షన్ సభ్యుడు బషారత్ ఖాన్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు సిడాం సకారాం, పీఏసీఎస్ చైర్మన్ కుర్సింగా ఓంప్రకాష్ పాల్గొన్నారు.

ఆదర్శ రైతుల వ్యవస్థ పునరుద్ధరించాలని వినతి..

కౌటాల: ఆదర్శ రైతుల వ్యవస్థను పునరుద్ధరించాలని ఆదర్శ రైతులు శుక్రవారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే నివాసంలో ఎమ్మెల్యే కోనేరు కోనప్పను కలిసి వినతిపత్రం అందించారు. ఎమ్మెల్యే


కౌటాల: వినతిపత్రం అందజేస్తున్న రైతులు

సానుకూలంగా స్పందించినట్లు వారు పేర్కొన్నారు. అనంతరం చింతలమానెపల్లి మండలం బాలజీఅనుకోడ గ్రామానికి చెందిన పలువురు యువకులు బీఆర్ఎస్ పార్టీలో చేరగా పార్టీలోకి ఆహ్వానించారు. ఎంపీపీ నానయ్య, ఆదర్శ రైతులు అంజన్న, వుండలిక్, విశ్వనాథ్, రాంచందర్, బుజంగ్‌రావు, మహేష్, రాజ్‌కుమార్, నాయకులు ఉన్నారు.

అన్ని వర్గాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

కాగజ్‌నగర్‌టౌన్: అన్ని వర్గాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. శుక్రవారం తన నివాసంలో సిర్పూర్ (టి) ముస్లిం, మైనారిటీ ప్రతినిధులతో సమావేశాన్ని నిర్వహించారు. సిర్పూర్(టి)లో మైనారిటీ కమ్యూనిటీ హాల్ ఉర్దూ ఘర్ మంజూరు పత్రాన్ని ముస్లిం, మైనారిటీ ప్రతినిధులకు అందజేశారు.

జిల్లా కేంద్రంలో పర్యటించిన ఎమ్మెల్యే

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని జన్కాపూర్‌లో శుక్రవారం ఎమ్మెల్యే ఆత్రం సక్కు పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీలో డ్రెయినేజీలు, రోడ్ల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సీసీ రోడ్డు, డ్రెయినేజీలు, వీధి దీపాల కోసం సీఎం కేసీఆర్ ఎస్‌డీఎఫ్ నిధులు విడుదల చేశారని, త్వరలో పనులు ప్రారంభిస్తామన్నారు. ఆయన వెంట బీఆర్ఎస్ కార్యకర్తలు ఉన్నారు.


జన్కాపూర్ కాలనీలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే సక్కు

బోర్‌వెల్ మంజూరు చేయాలని ఎమ్మెల్యేకు వినతి

రెబ్బెన: గోలేటి గ్రామ పంచాయతీ పరిధిలోని గోండ్‌గూడ, పర్ధాన్‌గూడ గ్రామాల్లో కమ్యూనిటీ షెడ్డు, బోర్‌వెల్‌లు మంజూరు చేయాలని గ్రామస్తులు ఎమ్మెల్యే ఆత్రం సక్కును కోరారు. శుక్రవారం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే స్పందిస్తూ త్వరలోనే షెడ్డుతో పాటు బోర్‌వెల్ మంజూరు చేస్తామని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామస్తులు మడావి వెంకట్రావ్, జంగు పటేల్, మధు, సురేశ్, లచ్చు, లక్ష్మణ్, తిరుపతి, బీఆర్ఎస్ నాయకులు విమలేష్, సుదర్శన్‌గౌడ్, రాజేష్‌లు పాల్గొన్నారు.


ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

ఎన్‌హెచ్ఎం ఉద్యోగులకు న్యాయం చేయాలి

ఆసిఫాబాద్‌అర్బన్: ఎన్‌హెచ్ఎం స్కీంలో పని చేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ప్రభుత్వం న్యాయం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేందర్ డిమాండ్ చేశారు. ఎన్‌హెచ్ఎం ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలన్న డిమాండ్‌తో జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట ప్రారంభించిన సమ్మె శుక్రవారం రెండో రోజుకు చేరింది. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో చెప్పిన విధంగా స్కీంలో పని చేస్తున్న ఉద్యోగులను షరతులు లేకుండా రెగ్యులర్ చేయాలన్నారు. యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మధుకర్, నాయకులు సాధాలక్ష్మి, రాణి, గంగుబాయి తదితరులు పాల్గొన్నారు.


ధర్నా చేస్తున్న ఎన్‌హెచ్ఎం ఉద్యోగులు

నేడు ఏబీఏపీ సమావేశం

సిర్పూర్(టి): కాగజ్‌నగర్ పట్టణంలోని న్యూకాలనీ అయ్యప్ప స్వామి ఆలయంలో ఈనెల 2న అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ (ఏబీఏపీ) సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఏబీఏపీ జిల్లా అధ్యక్షుడు పోతురాజుల రమేశ్, ప్రధాన కార్యదర్శి తులసీదాస్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు కొనసాగుతుందన్నారు. జిల్లాలోని అయ్యప్ప భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

వైద్య శిబిరానికి స్పందన

తిర్యాణి: భవన నిర్మాణ కార్మిక సంఘం (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి స్పందన లభించింది. వైద్యులు శిబిరానికి వచ్చిన వారికి పలు పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో ఎస్సై చుంచు రమేశ్, వైద్య సిబ్బంది మహేశ్, వంశీ, శివ, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి సింగం మొగిలి గౌడ్, మండల అధ్యక్షుడు బోగే రవి తదితరులు ఉన్నారు.

రక్తదాన శిబిరం

కెరమెరి: అన్ని దానాల కన్న రక్తదానం గొప్పదని ఎంపీడీవో మహేందర్, ఎస్సై విజయ్, వైద్యాధికారి వినోద్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో సన్‌రైజ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. శిబిరంలో 50 మంది యువకులు రక్తదానం చేశారు. వారికి పండ్లు, ఫలాలు అందించారు. ఫౌండేషన్ వ్యవస్థాపకుడు జమీల్, డివిజన్ అధ్యక్షుడు ముజాహిద్, హెచ్‌ఆర్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సుజాయిత్ ఖాన్, ఫార్మసిస్ట్ ఖలీల్ ఉన్నారు.

ఉపాధ్యాయుల నిరసనలు


ఆసిఫాబాద్‌రూరల్: డీఈవో కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు


వినతిపత్రం అందజేస్తున్న టీచర్లు

కెరమెరి/జైనూర్/ రెబ్బెన /ఆసిఫాబాద్‌రూరల్: సీపీఎస్‌ను తొలగించి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని శుక్రవారం మండల కేంద్రాల్లో గల తహసీల్దార్ కార్యాలయాల్లో ఉపాధ్యాయులు వినతిపత్రాలు అందజేశారు. పెన్షన్ విద్రోహ దినం సందర్భంగా డీఈవో కార్యాలయం ఎదుట, పాఠశాలల్లో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు.

సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె

ఆసిఫాబాద్‌రూరల్: సమస్యలు పరిష్కరించే వరకు నిరవధికంగా సమ్మె కొనసాగిస్తామని సర్వ శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షురాలు విజయలక్ష్మి అన్నారు. జిల్లా కేంద్రంలోని డీఈవో కార్యాలయం ఎదుట శుక్రవారం నిరసన తెలిపారు. అనంతరం కార్యాలయ సీనియర్ అధికారికి సమ్మె నోటీసు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మూడు రోజులుగా సమ్మె చేసినా ప్రభుత్వంలో ఎలాంటి చలనం లేదన్నారు. సమస్యలు పరిష్కారం అయ్యే వరకు నిరవధిక సమ్మె చేపడతామని తెలిపారు. 15 ఏళ్లుగా పనిచేస్తున్న తమ డిమాండ్లు నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో కోశాధికారి నగేష్, నాయకులు సంతోష్, రమేశ్, మోహన్, సందీప్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.


సమ్మె నోటీసు అందిస్తున్న ఉద్యోగులు

నిత్యావసర సరకులు పంపిణీ


నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న సీఐ, ఎస్సై

దహెగాం: మండలంలోని మారుమూల గిరిజన గ్రామం శంకరాపురంలోని నిరుపేదలకు పోలీసులు శుక్రవారం బియ్యం, దోమతెరలు, టార్చిలైట్లు పంపిణీ చేశారు. సీఐ నాగరాజు మాట్లాడుతూ ఎస్పీ, డీఎస్పీల ఆదేశాల మేరకు 20 కుటుంబాలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశామన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై సనత్‌కుమార్ పాల్గొన్నారు.

25 నుంచి డీఈడీ పరీక్షలు

ఆసిఫాబాద్‌రూరల్: డీఈడీ రెండో సంవత్సరం అభ్యర్థులకు ఈ నెల 25 నుంచి అక్టోబర్ 3వ తేదీ వరకు పరీక్ష నిర్వహిస్తున్నట్లు పరీక్ష నిర్వహణ అధికారి ఉదయ్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షకు సంబంధించిన హాల్ టికెట్లను తీసుకోవాలని సూచించారు. పరీక్ష ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు ఉంటుందని తెలిపారు.

'అంగన్‌వాడీ'ల సమస్యలు పరిష్కరించాలి

దహెగాం: ఐసీడీఎస్‌లో పని చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ కవితకు సమ్మె నోటీసు అందజేశారు. సీఐటీయూ మండల కోశాధికారి వజ్రమ్మ మాట్లాడుతూ కనీస వేతనం, పెన్షన్, ఈఎస్ఐ, పీఎఫ్, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఈనెల 11 నుంచి అంగన్‌వాడీ కార్యకర్తలు సమ్మెలో పాల్గొనాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు మల్లీశ్వరి, కళావతి, కమల, రమాదేవి, విజయకుమారి, సమీనా, సుగుణ తదితరులు పాల్గొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

కొనసాగుతున్న ఉన్నతి శిక్షణ

ఆసిఫాబాద్‌రూరల్: 6 నుంచి 10వ తరగతులకు బోధించే ఉపాధ్యాయులకు ఇస్తున్న ఉన్నతి శిక్షణ కార్యక్రమం శుక్రవారం ముగిసింది. జిల్లా కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో తెలుగు, జన్కాపూర్ ఉన్నత పాఠశాలలో హిందీ, ఇంగ్లిష్ బోధించే వారికి శిక్షణ ఇచ్చారు. నేటి నుంచి 5వ తేదీ వరకు రెండో విడత శిక్షణ ఉంటుందని డీఈవో అశోక్, ఎస్‌వో శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసిఫాబాద్‌లో గణితం, సైన్స్, సోషల్, కాగజ్‌నగర్‌లో హిందీ, ఇంగ్లిష్, తెలుగు బోధించే ఉపాధ్యాయులకు శిక్షణ ఉంటుందన్నారు.

ఈవీఎంలపై అవగాహన

తిర్యాణి: మండల కేంద్రంలో ఎన్నికల్లో వినియోగించే ఈవీఎం, వీవీ ప్యాడ్లపై శుక్రవారం ప్రజలకు అవగాహన కల్పించారు. తహసీల్దార్ అనంతరాజు మాట్లాడుతూ ఓటు వేసేటప్పుడు అయోమయం కాకుండా ఉండేందుకు మాక్ యంత్రాల ద్వారా అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతీ ఓటరు తమ ఓటు హక్కు తప్పనిసరిగా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై చుంచు రమేశ్, ఆర్ఐ మోహన్ తదితరులు ఉన్నారు.

'సిర్పూర్ కాంగ్రెస్ అభ్యర్థిగా అవకాశం కల్పించాలి'

ఆసిఫాబాద్: త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో సిర్పూర్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా తనకు అవకాశం కల్పించాలని ఓయూ జేఏసీ నేత అనిల్‌కుమార్ కామ్రే కోరారు. కాంగ్రెస్ అభ్యర్థిగా దరఖాస్తు చేసుకున్న అనంతరం శుక్రవారం జిల్లా కేంద్రంలో డీసీసీ అధ్యక్షుడు విశ్వ ప్రసాదరావు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు వసంత్‌రావును మర్యాద పూర్వకంగా కలిశారు.

సాక్షి సినిమాలు

ఆసిఫాబాద్
కుమురంభీం : ఖుషి

కాగజ్‌నగర్
వెంకటరమణ : ఖుషి

– ఆసిఫాబాద్‌అర్బన్

కూరగాయల ధరలు

కూరగాయలు	ధర(కిలో)
టమాటా	రూ.40
సిమ్లామిర్చి	80
దోసకాయ	60
చామగడ్డ	80
వంకాయ	60
బీరకాయ	80
కాకరకాయ	80
బెండకాయ	60
అలసంద	60
దొండకాయ	80
పచ్చిమిర్చి	80
పాలకూర	40
సోరకాయ	40
చిక్కుడు కాయ	80
గోబి(పూల్)	80
క్యాబేజి	60

–ఆసిఫాబాద్‌అర్బన్

ఆదివాసీలకే టికెట్ కేటాయించాలి

తిర్యాణి: ఎస్టీ రిజర్వుడ్ నియోజకవర్గం ఆసిఫాబాద్‌లో అన్ని పార్టీలు ఆదివాసీలకు చెందిన నాయకులకే టికెట్లు కేటాయించాలని తుడుందెబ్బ డివిజన్ అధ్యక్షుడు వెడ్మ భగవంత్‌రావు డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని కుమురం భీం చౌక్ వద్ద విలేకర్లతో మాట్లాడుతూ అధిక శాతం ఉన్న ఆదివాసీలకు కాకుండా లంబాడీ వర్గానికి టికెట్ కేటాయిస్తే ఆయా పార్టీలను గ్రామాల్లో తిరగనివ్వమని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకపుపోడ్ సంఘం జిల్లా అధ్యక్షుడు దశరథం, తుడుందెబ్బ డివిజన్ గెడం సుభాశ్, నాయకులు వినోద్, భీంరావు, భీమయ్య తదితరులు ఉన్నారు.

సరస్వతికే కేటాయించాలి..

కాంగ్రెస్ పార్టీ టికెట్‌ను ఆదివాసీ మహిళ సరస్వతికే కేటాయించాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో కుమురం భీం చౌక్ వద్ద విలేకర్లతో మాట్లాడుతూ పార్టీలోకి కొత్తగా వచ్చిన నాయకులకు టికెట్ ఇవ్వాలని చూడటం సరికాదన్నారు. సరస్వతికి టికెట్ కేటాయించకుంటే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పెందూర్ దౌలత్‌రావు, దశరథం, వినోద్, చిత్రం సోము తదితరులు ఉన్నారు.

కెరమెరి: వచ్చే ఎన్నికల్లో ఆసిఫాబాద్ నియోజకవర్గం ఎమ్మెల్యే టికెట్‌ను అన్ని పార్టీలు ఆదివాసీలకే కేటాయించాలని ఆదివాసీ సంఘాల నాయకులు, కుల పెద్దలు డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని హట్టి బేస్ క్యాంపులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. పటేల్, దేవారి, రాయిసెంటర్ సర్‌మోడీలు కుసుంబ్‌రావు, రాయిసిడాం జంగు, బొజ్జిరావు, ఆనందరావు, సోము, సిడాం జగన్నాథ్‌రావు, జంగు తదితరులు ఉన్నారు.

మరోసారి గడువు పొడిగింపు

ఆసిఫాబాద్‌రూరల్: ఇంటర్‌లో ప్రవేశాలకు ప్రభుత్వం మరోసారి గడువు పొడిగించినట్లు డీఐఈవో శ్రీధర్‌సుమన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 16 వరకు విద్యార్థులు అడ్మిషన్లు పొందే అవకాశం కల్పించినట్లు ఆయన వివరించారు.

కొనసాగుతున్న డివిజన్ దీక్షలు

బోథ్: బోథ్‌ను డివిజన్ చేయాలని కొనసాగుతున్న దీక్షలు శుక్రవారం 48వ రోజుకు చేరుకున్నాయి. శుక్రవారం దీక్షలో డివిజన్ సాధన సమితి సభ్యులు కూర్చున్నారు. రానున్న ఎన్నికల లోపు బోథ్‌ని డివిజన్‌గా ప్రకటించాలని డిమాండ్ చేశారు.

ఇంటింటా మట్టి సేకరణ

వాంకిడి: మేర దేశ్ –మేర మట్టి కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని ఇందాని గ్రామంలో బీజేపీ ఆధ్వర్యంలో ఇంటింటా మట్టి సేకరణ కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొట్నాక విజయ్ మాట్లాడుతూ పవిత్ర అమృత వాటిక నిర్మాణం కోసం గ్రామగ్రామాన మట్టి సేకరణ చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 15 వ తే దీ వరకు కార్యక్రమం కొనసాగుతుందన్నారు.

కెరమెరి: మేర దేశ్.. మేర మట్టి కార్యక్రమంలో భాగంగా పవిత్ర అమృత వాటిక కోసం శుక్రవారం మండలంలో మట్టి సేకరణ కార్యక్రమం ప్రారంభించినట్లు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆత్మారాం అన్నారు. శివాలయంలో కలశ పూజ నిర్వహించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. పార్టీ జిల్లా కార్యదర్శి రాజన్న, నాయకులు ప్రకాశ్, శ్రీధర్, శ్రీకాంత్, సాగర్, గోపి, కిషన్, రాము, నవీన్, తదితరులు ఉన్నారు.